క్లుప్తంగా

నేడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాక

నర్సంపేట : ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఉదయం 11 గంటలకు నర్సంపేటకు రానున్నారు. ఈ మేరకు పట్టణంలోని కాకతీయ కళాశాలలో మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ స్థలాన్ని శనివారం బీఎస్పీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి గుండాల మదన్ కుమార్ పరిశీలించారు.

టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా దర్గయ్యనాయక్



రాయపర్తి: తెలంగాణ జన సమితి(టీజేఎస్) పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మండలంలోని జయరాంతండా(కె)కు చెందిన భూక్య దర్గయ్యనాయక్ నియమితులైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం టీజేఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నట్లు తెలిపారు. పార్టీబలోపేతం కోసం కృషి చేస్తానన్నారు.

ప్రాణ రక్షణ కల్పించండి

చెన్నారావుపేట: మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడైన పల్లకొండ కుమారస్వామికి కొందరు వ్యక్తుల నుంచి ప్రాణభయం ఉందని, ప్రాణరక్షణ కల్పించాలని శనివారం పోలీస్‌కమిషనర్‌కు వికలాంగుల జాక్ నాయకులు నల్లెల్ల రాజయ్య, రాజు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ తన ఇంటి విషయంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడులు చేస్తు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

సెల్‌ఫోన్ అప్పగింత

వర్ధన్నపేట: ప్రయాణంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకుని సెల్‌ఫోన్‌ను అప్పగించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మహబూబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి జూన్ 6న ప్రయాణంలో వర్ధన్నపేట వద్ద తన రెడ్‌మీ సెల్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయంపై సీఈఐఆర్ పోర్టల్‌కు ఫిర్యాదు చేశాడు. అతడి ఫోన్‌ను ట్రేస్ చేసి శనివారం పట్టుకుని వెంకటేశ్వర్‌రెడ్డికి అప్పగించడం జరిగిందన్నారు. సెల్‌ఫోన్ విలువ రూ.8 వేలు ఉంటుందన్నారు.

ఆస్పత్రికి నెఫ్రాలజిస్టును నియమించాలి



నర్సంపేట రూరల్ : జిల్లా ఆస్పత్రికి నెఫ్రాలజిస్టుని నియమించాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ అన్నారు. ఆస్పత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్‌కు వినతిపత్రాన్ని శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని ఆరు మండలాలకు సంబంధించిన డయాలసిస్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు వైద్యులు లేకపోవడంతో వరంగల్, హన్మకొండ, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి జిల్లా ఆస్పత్రికి నెఫ్రాలజిస్టును నియమించాలన్నారు.

పేదల పక్షపాతి 'చల్లా'ను ఆశీర్వదించండి



ఆత్మకూరు : జ్యోతికి బొట్టు పెడుతున్న మహిళ



దామెర : ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

- ఇంటింటా ప్రచారంలో చల్లా జ్యోతి

ఆత్మకూరు: పేదల పక్షపాతి బీఆర్‌ఎస్ పరకాల అభ్యర్థి చల్లా ధర్మారెడ్డిని ఆశీర్వదించాలని ఆయన సతీమణి చల్లా జ్యోతి కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి వీర తిలకం దిద్దారు. గ్రామంలోని వృద్ధులను, వ్యాపారులను, ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా చల్లా జ్యోతి మాట్లాడుతూ.. ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పరిపాలన కొనసాగిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీను మరోసారి ఆశీర్వదించాలన్నారు. చల్లా ధర్మారెడ్డి గెలిస్తేనే పరకాల నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి ధర్మారెడ్డి హయాంలో పరకాల నియోజకవర్గంలో జరిగిందన్నారు. పూటకో మాట మార్చే నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, ప్రధానకార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, నాయకులు రవీందర్, కాంతాల కేశవరెడ్డి, దుంపల బుచ్చిరెడ్డి, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు పాపని రవీందర్, ఉప సర్పంచ్ వంగాల స్వాతిభగవాన్‌రెడ్డి, నాయకులు బాషబోయిన పైడి, బాషబోయిన సాగర్, నత్తి సుధాకర్, అంకూస్, తదితరులు పాల్గొన్నారు.

'చల్లా'ను గెలిపించాలి

దామెర: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని మరోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి కోరారు. మండలంలోని ఊరుగొండలో బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ధర్మారెడ్డి చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు కూనాటి సునీల్‌రెడ్డి, పాలెపాక సతీష్, ఉప సర్పంచ్ జన్ను విద్యాసాగర్, మాజీ సర్పంచ్‌లు జక్కుల రవి, మల్లాడి రాజిరెడ్డి, నాయకులు బొల్లు సమ్మిరెడ్డి, గోగుల వీరారెడ్డి, సిలువేరు నర్సయ్య, అక్కెళ్ల ప్రశాంత్, జన్ను విజయ్, వినయ్, తిప్పారపు సాంబయ్య, రమేష్, పైండ్ల శ్రీను, బానాల కార్తీక్ పాల్గొన్నారు.

నేడు 'చల్లా' ఇంటింటి ప్రచారం



ఆత్మకూరు : వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న జ్యోతి

పరకాల: పట్టణంలో ఆదివారం బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను శనివారం తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసిన అనంతరం ఉదయం 6 గంటలకు 1,2,13 వార్డుల్లో, 8 గంటలకు 12,14,1,15,22 వార్డుల్లో, సాయంత్రం 6 గంటలకు రాజీపేట, రాత్రి 7 గంటలకు సీతారాంపూర్‌లో ఎన్నికల ప్రచారంతో కర్నర్ మీటింగ్‌లో ప్రసంగించనున్నట్లు తెలిపారు.

వచ్చారు.. వెళ్లారు..



చెన్నారావుపేట : సమావేశం నుంచి వెళ్లిపోతున్న ఎంపీటీసీ సభ్యులు



పర్వతగిరి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్

- ఎన్నికల కోడ్‌తో ముగిసిన మండల సభలు

చెన్నారావుపేట: ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం ఎలాంటి చర్చ జరుగకుండానే ముగిసింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీలు, అధికారులు, లింగాపురం సర్పంచ్ సభకు హాజరయ్యారు. కోరం ఉన్నందున సభను ప్రారంభించడానికి ముందుగానే సభ అధ్యక్షులకు ఎన్నికల సమావేశం ఉంది మేము వెళ్తున్నామని బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు వెళ్లిపోయారు. వెంటనే ఎంపీపీ బాదావత్ విజేందర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఎలాంటి తీర్మానాలు చేయడానికి లేకపోవడంతో సభను ముగిస్తున్నట్లు వెల్లడించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పర్వతగిరి: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ లూనావత్ కమల అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎలాంటి చర్చ, తీర్మానాలు లేకుండానే సమావేశం ముగించారు. అధికారులు తమ శాఖల నివేదికలను ప్రజాప్రతినిధుల ముందు ఉంచారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మతిస్థిమితం లేని బాలిక అదృశ్యం



జాటోతు శిరీష

పర్వతగిరి: మతిస్థిమితం లేని బాలిక తప్పిపోయిన సంఘటన మండలంలోని మూడెత్తులతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం.. మూడెత్తులతండాకు చెందిన జాటోతు బిచ్చ కూతురు శిరీష శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయింది. శిరీష ఇటీవలే గుండు చేయించుకుని ఉంది. తలవెనుక వైపు కొన్ని గాయాలు, మెడలో ఎరువు, నలుపు దారాలు ఉన్నాయని చెప్పారు. అమ్మాయి మాట్లాడలేదని, ఇంట్లో నుంచి వెళ్లిన సమయంలో బ్లూ చుడీదార్, బ్లాక్ పాయింట్ వేసుకుని ఉందని అన్నారు. శిరీష తండ్రి బిచ్చ ఫిర్యాదు మేరకు శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే స్థానిక ఎస్సై 8712685242, పోలీస్‌స్టేషన్ 8712685028 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

దళారులకు అమ్మి మోస పోవద్దు



సంగెం: రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోస పోవద్దని డీపీఎం భవాని అన్నారు. శనివారం మండలంలోని గవిచర్లలో అంబేడ్కర్ గ్రామైక్య సంఘం, లోహితలో జ్యోతి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళారీ వ్యవస్థను అరికట్టి మద్దతు ధరలు అందించేందుకే ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సాగర్, ఏపీఎం కిషన్, సీసీలు, సంఘాల సభ్యులు రైతులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

వర్ధన్నపేట: మండలంలోని కొత్తపెల్లికి చెందిన ఆకుల రవీష్‌కుమార్, పొన్నం శ్రీకాంత్ ఆధ్వర్యంలో 30 మంది యువకులు శనివారం వర్ధన్నపేట బీజేపీ అభ్యర్థి కొండేటి శ్రీధర్ సమక్షంలో పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు రంగినేని రేవంత్ రావు, మండల అధ్యక్షుడు రాకేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కొండేటి శ్రీధర్‌ను గెలిపించడానికి పని చేస్తామని చెప్పడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో అశోక్, కేశవరెడ్డి, తిరుపతిరెడ్డి, కిరణ్, రాంరెడ్డి, కుమారస్వామి, రాజు పాల్గొన్నారు.

బిర్యానీ సెంటర్ యజమానులపై కేసు

పర్వతగిరి: మండల కేంద్రంలోని బిర్యానీ సెంటర్ యజమానులపై కేసు నమోదు చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని కరీం బిర్యానీ, యాకుబ్ బిర్యానీ సెంటర్లలో శనివారం తనిఖీ చేయగా ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా బయట నుంచి మద్యం తీసుకువచ్చి తాగి పక్క వారికి ఇబ్బంది కలిగించే విధంగా చేశారన్నారు. దీంతో బిర్యానీ సెంటర్ యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న మండల పూజలు



పడిపూజలో పాల్గొన్న భక్తులు

నర్సంపేట: పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ ఆధ్వర్యంలో మండల పూజలు కొనసాగుతున్నాయి. శనివారం మొదటి పుష్పాభిషేకం, దివ్య పడిపూజ, స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరాంతఊశ్వరయ్య, మాదారపు చంద్రశేఖరం, భూపతి లక్ష్మీనారాయణ, ఆకుల ప్రభాకర్, భరత్, శ్రీధర్, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన



పర్వతగిరి: స్థానిక విజడమ్ పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. ఈ వేడుకలకు పర్వతగిరి లయన్స్ క్లబ్ చైర్మన్ చిదురాల వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు, మేనేజ్‌మెంట్ స్కిల్స్ ముఖ్యమని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్ మాట్లాడారు. విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్లు సుధాకర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు మెమెంటోలు ప్రధానం చేశారు.

కుంకుమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవం



అన్నదానం చేస్తున్న దీప్తి-రాకేష్‌రావు దంపతులు

పరకాల: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని పరకాల పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో సందడిగా మారింది. పూజలు నిర్వహించేందుకు మహిళలు బారులుదీరారు. ఈ సందర్భంగా కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. డీజీ యోద యాజమాని కొక్కిరాల దీప్తి-రాకేష్‌రావు దంపతులు భక్తులకు మహాఅన్నదానం చేశారు. దేవస్థానం చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, ప్రధాన అర్చకుడు నాగభూషణం శర్మతో పాటు ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

23న మున్నూరుకాపు ఆత్మీయ ఆశీర్వాద సభ

హన్మకొండ: మున్నూరుకాపుల ఆత్మీయ ఆశీర్వాద, కృతజ్ఞత సభను ఈనెల 23న హనుమకొండలో నిర్వహించనున్నట్లు మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయంత్రం జరగనున్న సభకు మున్నూరుకాపులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్నూరుకాపు సంఘం నాయకులు కటకం పెంటయ్య, పెరుకారి శ్రీధర్ రావు, కనుకుంట్ల రవికుమార్, వద్దిరాజు వెంకన్న, బండి కుమారస్వామి, వాసాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాయమాటలు నమ్మొద్దు



నర్సంపేట రూరల్ : బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట : సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ నర్సంపేట అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : ఎన్నికల ముందు వచ్చి గ్రామాల్లో హడావుడి చేస్తూ మాయమాటలు చెబుతూ కాలం వెళ్లదీసి, ఓట్లు అయిపోగా పత్తా లేకుండా పోయే వారి మాటలు నమ్మి ప్రజలు మోస పోవద్దని బీఆర్‌ఎస్ నర్సంపేట అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 4,5,6,7,8, 17,18, వార్డులలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల అవసరాలను తీర్చడంతోపాటు వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. పట్టణంలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓట్లు వేయాలని కోరారు. ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పెద్దికి మహిళలు మంగళహారతులు, బతుకమ్మ, బోనాలతో స్వాగతం పలికారు. కొలాటాలు, డప్పు వాయిదాల నడుమ ర్యాలీని కొనసాగించారు.

రాహుల్ షో అట్టర్ ఫ్లాప్

నర్సంపేట: పట్టణంలో రాహుల్‌గాంధీ రోడ్ షో అట్టర్ ఫ్లాప్ షోగా మారిందని పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ క్షీణించిందన్నారు. నర్సంపేటకు టూరిస్టులు వద్దని, ప్రజా సమస్యలు తీర్చే వారు కావాలన్నారు.

నర్సంపేట రూరల్ : మండలంలోని మాధన్నపేటకు చెందిన బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లోని శోభన్‌బాబు, మాజీ ఉపసర్పంచ్ గంగుల బాబు, మాజీ బీజేపీ అధ్యక్షుడు భిక్షపతి, కేశెట్టి రవి, గంగుల రాజన్న, బోల్లేని పాపయ్యల రాజీనామా చేసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

చెన్నారావుపేట: పెద్ది గెలుపు కోసం ఆ పార్టీ మండల కన్వీనర్ కంది కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాజీవ్‌నగర్ కాలనీలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

దుగ్గొండి: మండలంలోని మందపల్లిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీనియర్ నాయకులు రాజేందర్ పాల్గొన్నారు.

పెద్దికి ఆర్‌పీఐ మద్దతు

ఖానాపురం: పెద్ది సుదర్శన్‌రెడ్డి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు ఓటును అభ్యర్థిస్తున్నారు. అలాగే పెద్ది గెలుపు కోసం ఆర్‌పీఐ బాధ్యులు మద్దతు ప్రకటించారు.

అందరివాడిని.. ఆశీర్వదించండి



ఐనవోలు : ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్



హసన్‌పర్తి: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అరూరి

- బీఆర్‌ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి

ఐనవోలు: ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకునే అందరివాడిని.. ఆశీర్వదించి అసెంబ్లీకి పంపిస్తే సేవ చేస్తా. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసే నేను కావాలా... రక్తచరిత్ర కలిగిన ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ కేఆర్ నాగరాజు కావాలో మీరే ఆలోచించాలని బీఆర్‌ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. మండలంలోని నర్సింహులగూడెం, ముల్కలగూడెం, కొండపర్తి, వనమాల కనపర్తి, రాంనగర్, లింగమోరిగూడెం, ఉడుతగూడెం, నాగపురం, ఒంటి మామిడిపల్లి గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. గ్రామాల్లోని నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

పర్వతగిరి: బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అరూరి రమేష్ అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు, కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్ నాగరాజు వ్యక్తిగత అనుచరుడు కొమ్ము రమేష్ అరూరి రమేష్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరాడు.

మడికొండ: బీజేపీ వరంగల్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు వల్లెపు రేణుక, తదితరులు బీఆర్‌ఎస్ 46వ డివిజన్ పట్టణ శాఖ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈమేరకు వారికి కండువాలు కప్పి పార్టీలోకి రమేష్ ఆహ్వానించారు.

అతనొక ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు.. నేనొక సేవకుడిని

హసన్‌పర్తి: 'అతనొక ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్.. విప్లవకారులను చంపాడు, నేను మాత్రం మీ మధ్యలోనే 12 ఏళ్లుగా ఉంటూ ప్రజా సేవ చేస్తున్నాను' అని బీఆర్‌ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. దేవన్నపేటకు చెందిన మాజీ దళ కమాండర్లు శ్రీపతి జంపయ్య, పోలెపల్లి భీమయ్యతో పాటు పలు పార్టీకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి రమేష్ ఆహ్వానించారు.

వర్ధన్నపేట : ఎమ్మెల్యే అరూరి రమేష్ మూడోసారి గెలుపుకోసం శనివారం వాడ వాడలా, ఇంటింటా బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. పట్టణంలో మునిసిపల్ చైర్ పర్సన్ ఆంగోతు అరుణ, కౌన్సిలర్ తోటకూరి రాజమణి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం ప్రతిపక్ష పార్టీలు తమ మనుగడ కోసం ఉన్నవి లేనివి కల్పించి కల్లబొల్లి మాటలు మాట్లాడుతూ ప్రజలను అయోమయానికి గురి చేయడానికి చూస్తున్నారని ప్రజలు అమాయకులు కారని వారు బీఆర్‌ఎస్‌నే పూర్తిగా నమ్ముతున్నారన్నారు.

మానవత్వం చాటిన యువకులు



వృద్ధుడికి దుస్తులు తొడిగించిన యువకులు

ఖానాపురం: రోడ్డు పక్కన పడిపోయిన ఓ వృద్ధుడిని చేరదీసి యువకులు మానవత్వం చాటుకున్న సంఘటన మండలంలోని బుధరావుపేట శివారులో శనివారం చోటుచేసుకుంది. మండలంలోని బుధరావుపేటకు చెందిన మోడెం ఎల్లగౌడ్, రమేష్ ఇరువురు గ్రామశివారులోని అటవీ ప్రాంతం వైపు తమ స్నేహితుని వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో అటవీ ప్రాంతం వద్ద గుంతలో ఓ వృద్ధుడు పడిపోయి ఉన్నాడు. గుంతలో నీరు లేక గొంతు ఆరిపోయి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. గమనించిన యువకులు వెంటనే గుంతలో నుంచి వృద్ధుడిని గడ్డపైకి చేర్చారు. వెంటనే అక్కడి నుంచి ద్విచక్రవాహనంపై బుధరావుపేటకు తీసుకొచ్చి మంచినీళ్లు అందజేసి భోజనం అందజేసారు. వెంటనే ఎస్సై మాధవ్‌కు సమాచారం అందించగా నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని సూచనలు చేశారు. యువకులు నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో ఎల్లగౌడ్, రమేష్‌లను ప్రజలు అభినందించారు.

బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ

చెన్నారావుపేట : మండలంలోని పాత మగ్దుంపురం గ్రామానికి చెందిన నాంపెల్లి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతని కుమారుడు సంపత్ మిత్రులు కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కిలోల బియ్యం అందించారు. చింతకాయల లక్ష్మీనారాయణ, భాస్కర్, శోభన్‌బాబు ఉన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

వర్ధన్నపేట: సేవా దృక్పథంతో ముందుకు వచ్చి పేద విద్యార్థులకు తమ వంతు సహాయంగా కొంతమేర ఫీజులు చెల్లించడం అభినందనీయమని పుస్కోస్ పాఠశాల అడ్మినిస్ట్రేటర్ సిస్టర్ జెనీఫర్ అన్నారు. శనివారం పట్టణంలోని పుస్కోస్ పాఠశాలలో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ జిల్లా అధ్యక్షురాలు చెన్న ఝాన్సీలక్ష్మి చదువుతున్న కొంత మంది పేద విద్యార్థులకు పాఠశాల ఫీజులు చెల్లించి చేయూతనందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని ఆశించారు. ఝాన్సీలక్ష్మిని అన్నెపు రాజేంద్రం, లక్ష్మిలను అభినందించారు.